# "నాణ్యమైన విద్యకు నెలవు -- కంచి యూనివర్శిటీ చదువు"

ప్రాచీన భారతదేశం కళలకు కాణాచి, సమస్త విద్యలకూ పుట్టినిల్లు. ప్రాచీన భారతీయ విద్యారంగ చరిత్రలో కాంచీపురం, నలంద, తక్షశిల, వారణాసి- ఈ నాలుగు ప్రదేశాలూ జ్ఞానాన్ని పంచే అత్యుత్తమ విశ్వవిద్యాలయాలుగా ప్రఖ్యాతి గడించాయి. వీటన్నింటిలోనూ కాంచీ విశ్వవిద్యాలయానికి మరింత ప్రత్యేకత ఉండేది. మిగిలిన విశ్వవిద్యాలయాలలోని ఆచార్యులకు ఏ విషయంలో ఎటువంటి సందేహం కలిగినా వారు కాంచీపురానికి వచ్చి తమ సందేహాన్ని తాళపత్రాలపై వ్రాసి విశ్వవిద్యాలయప్రాంగణంలో నిర్ణీతస్థానంలో పెట్టిన కుండలలో భద్రపరిచి వేచిఉండేవారనీ- ఇక్కడి ఆచార్యులు వీలు వెంబడి ఆ సందేహాలకు తగినట్లు సమాధానం వ్రాసి తిరిగి అవే కుండలలో ఉంచేవారనీ చరిత్ర చెబుతున్నది. అందుకే కాంచీ విశ్వవిద్యాలయాన్ని "ఘటికాస్థానం' అనే పేరుతో పిలిచేవారు.

అంతటి మహత్తరక్షేత్రంలో మళ్లీ అంతటి ఘనమైన విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని కంచి కామకోటి పీఠ పరమాచార్యులు, "నడిచే దేవుని'గా జనం నీరాజనాలర్పించిన భగవత్స్వరూపులు శ్రీశ్రీశ్రీ చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ స్వాములవారు తలపోశారు. వారు నూరు సంవత్సరాల తమ ఇహలోక జీవితాన్ని పూర్తి చేసుకుని పరమాత్మలో ఐక్యమైన సంవత్సరమే ఆ మహాస్వామి దివ్యసంకల్పానికి ప్రస్తుతం కంచికామకోటి పీఠాధిపతులైన శ్రీశ్రీశ్రీ జయేన్ద్ర సరస్వతీ స్వాములవారు సాకారరూపం కల్పించడం జరిగింది..... "శ్రీ చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ విశ్వమహా విద్యాలయం' ఏర్పాటయింది.

తొలుత "న్యాయవిద్యాలయం'గా కేవలం సంస్కృతబోధనతో ప్రారంభమైన ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ 1993వ సంవత్సరంలో 'డీమ్డ్‌యూనివర్శిటీ' హోదాపొంది 'శ్రీచన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీవిశ్వమహావిద్యాలయం' (SCSVMV UNIVERSITY) గా ఎదిగింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ విద్యాసంస్థ ప్రగతిమార్గంలో అనేక విశేషాలు కనిపిస్తాయి. విద్యార్థులకు నేటి ఉపాధి యుగానికి అవసరమైన ఇంజనీరింగ్-టెక్నాలజీ వంటి అధునాతన కోర్సుల బోధనతో పాటుగా విలువలతో కూడిన ప్రాచీన శాస్త్ర-సాంస్కృతిక వారసత్వాన్ని సైతం అందించడం ఈ విశ్వవిద్యాలయానికి మాత్రమే ఉన్న విశిష్టతగా చెప్పుకోవచ్చు. ఒకవిధంగా ఇది ప్రాచీన-ఆధునికశాస్త్రాల సమ్మేళనం.

"విద్యార్థికి చదువు కేవలం ధనోపార్జనను మాత్రమే కాక ప్రాచీన భారతీయ సంస్కృతీ విలువలను కూడా నేర్పాల'నే ఆచార్యుల ఆకాంక్షకు ప్రతిరూపంగా- విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టే ప్రతి ఒక్కవిద్యార్థీ తప్పనిసరిగా భారతీయ సంస్కృతినీ- సంస్కృతభాషనూ అభ్యసించేవిధంగా కోర్సుల రూపకల్పన జరిగింది.

ప్రాచీన విద్యావ్యవస్థలో చదువు అంగడి సరుకు కాదు. విద్యార్థి ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా అతడి ఆసక్తికి తగినట్లుగా వివిధ శాస్త్రవిద్యలలో ఉచితంగా బోధన చేసేవారు గురువులు. వర్తమాన యుగంలో సైతం అటువంటి మంచి ఒరవడి తీసుకురావాలనే సత్సంకల్పంతో లాభార్జనకు దూరంగా కేపిటేషన్ ఫీజులు, డొనేషన్ల పేరిట విద్యార్థి పై మోయలేని భారం మోపకుండా నామమాత్రంగా నిర్వహణాఖర్చుమాత్రం తీసుకుంటూ నాణ్యమైన విద్యనందిస్తోంది "చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ విశ్వ మహావిద్యాలయం'. భవిష్యత్తులో ఈ ఫీజులు కూడా లేకుండా ఉచిత విద్యను అదే ప్రమాణాలతో అందించాలన్నది యూనివర్శిటీ ఆశయం!

కేవలం విద్యార్థి ప్రతిభ ఆధారంగానే ఇక్కడ ప్రవేశం లభిస్తుంది. ఎటువంటి ప్రవేశపరీక్షా లేకుండా- కోర్సుకు అవసరమైన పరీక్షలో విద్యార్థి సాధించిన మార్కుల ఆధారంగానే విద్యార్థుల ఎంపిక జరుగుతుంది. బి.ఇ., బి.టెక్., ఎం.బి.ఎ., ఎం.సి.ఎ. వంటి కోర్సులతో పాటుగా ఆయుర్వేదం, శిల్పశాస్త్రం; ఇంకా వ్యాకరణం, న్యాయం, సాహిత్యం, అద్వైత వేదాంతం-ఇలా సంస్కృతంలోని వివిధ శాస్త్రాలను కూడా అనుభవజ్ఞులైన ఆచార్యుల పర్యవేక్షణలో ఇక్కడ బోధించడం జరుగుతున్నది. పేదవిద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా స్కాలర్‌షిప్స్ అందించడం, స్పోర్ట్స్‌లో విశేషప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహాన్నివ్వడం, జాతీయస్థాయిలో నిర్వహించబడే AIEEE, MAT, CAT వంటి పోటీపరీక్షలలో ఉన్నత ర్యాంకులు వచ్చినవారికి ప్రాధాన్యత కల్పించడం వంటి చర్యల ద్వారా విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించడం యూనివర్శిటీ ప్రత్యేకతలు.

సంస్కృతబోధన కంచి యూనివర్శిటీ విశిష్టతలలో ఒకటిగా చెప్పుకోవచ్చు. ఇక్కడ సంస్కృతంలో చేరే ప్రతిఒక్క విద్యార్థికీ హాస్టలు వసతి ఉచితంగా కల్పించడమే కాక ప్రతిభగల విద్యార్థులకు స్కాలర్ షిప్ సౌకర్యాన్ని కూడా అందిస్తూ సంస్కృతవిద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతోంది.

SCSVMV విశ్వవిద్యాలయం పరిశోధనకు విస్తృతమైన ప్రాధాన్యత కల్పిస్తున్నది. అన్నిరకాల సైన్స్ సబ్జక్టులతో పాటు సంస్కృతంలోని వివిధ శాస్త్రాలలో మౌలిక (Fundamental), ప్రాయోగిక (Applied) పరిశోధనలు జరుగుతున్నాయి. విశ్వవిద్యాలయానికి మాత్రమే పరిమితమైన మరొక వైశిష్ట్యం ప్రాచీన తాళపత్రగ్రంథాల పరిరక్షణ. పరమాచార్యులవారు దేశమంతా సంచారం చేసిన రోజులలో తమ స్వహస్తాలతో దేశం నలుమూలల నుండి సేకరించిన అపురూపమైన తాళపత్రాలు వేలసంఖ్యలో ఇక్కడ పొందుపరిచబడి ఉన్నాయి. వీటికి రసాయనాలు పూసి భద్రపరచడం, డిజిటైజేషన్ ప్రక్రియ ద్వారా పుస్తకరూపంలో భావితరాలకు అందించడంతో పాటు అత్యంత విలువైన కొన్ని తాళపత్రగ్రంథాలను పరిష్కరించి ముద్రించడం కూడా జరుగుతున్నది. దీనితో పాటుగా జాతీయ తాళపత్ర పరిరక్షణా సంస్థ (NATIONAL MANUSCRIPTS MISSION) సహకారంతో తమిళనాడులోని అరుదైన తాళపత్రగ్రంథాల వివరాలను కూడా విశ్వవిద్యాలయం సేకరిస్తున్నది. ఇక ఏ విశ్వవిద్యాలయానికైనా అమూల్యమైన సంపద పుస్తకాలేనని చెప్పుకోవచ్చు! SCSVMVవిశ్వవిద్యాలయంలో అనేక వేల పుస్తకాలు "చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీ అంతర్జాతీయ గ్రంథాలయం' లో కొలువుతీరి ఉన్నాయి. ఈ గ్రంథాలయం యూనివర్శిటీకే ప్రత్యేక ఆకర్షణ. శ్రీచక్రాకారంలో నిర్మించిన గ్రంథాలయ భవనం చూపరులకు ఆహ్లాదం కలిగిస్తూ, ఆధునిక ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలుస్తున్నది. "ప్రార్థన చేసిన పిమ్మట జరిగే విద్యాభ్యాసం విద్యార్థి ప్రతిభను ద్విగుణీకృతం చేస్తుంది' అన్న పరమాచార్యుల వారి సూచనకు అనుగుణంగా విద్యార్థులంతా ప్రతిరోజూ ఉదయం లైబ్రరీలో జరిగే ప్రార్థనతో విద్యాకార్యక్రమాలను ప్రారంభిస్తారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలతో పాటు ఉపాధి అవకాశాలు చూపే "ప్లేస్‌మెంట్ సేవలు' యూనివర్శిటీకి తలమానికంగా నిలుస్తున్నాయి. దేశ-విదేశాల నుంచి విభిన్న రంగాలలో నిపుణులైన ప్రముఖులను రప్పించి వారిచేత విద్యార్థులకు తరచుగా ప్రత్యేక ఉపన్యాసాలు ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నారు. కార్యరంగంలో వారి అనుభవాలు విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. దీనితోపాటు విధినిర్వహణలో వివిధ సంస్థలతో ఎలా వ్యవహరించాలనే విషయం పట్ల కూడా వారికి అవగాహన ఏర్పడి ఈ పోటీ ప్రపంచంలో నగర విద్యార్థులకు ఏమాత్రం తీసిపోకుండా ముందుకు వెళ్లేందుకు ఆ కార్యక్రమాలు తోడ్పడుతున్నాయి.

అనేక సంస్థలలో ఎంపికై పనిచేస్తున్న యూనివర్శిటీ విద్యార్థుల అంకితభావం, నైపుణ్యాల పట్ల ఆకర్షితులై ఆయా యాజమాన్యాలు ఈ విశ్వవిద్యాలయ విద్యార్థులనే క్రమం తప్పకుండా నియమించుకోవడం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. Dr. Reddy's, Wipro, Aditya Birla, ICICI, TATA, Ramco, Sree Ram వంటివి ఈ ఏడాది విశ్వవిద్యాలయ విద్యార్థులను ఎంపిక చేసుకున్న ప్రముఖసంస్థలు. ఈ యూనివర్శిటీలో చదువుకుని వివిధ ప్రదేశాలలో పనిచేస్తున్న పూర్వవిద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంతో తమ అనుభవాన్ని నిరంతరం కొనసాగిస్తున్నారు. విశ్వవిద్యాలయానికీ-అనేక సంస్థలకీ మధ్య వారధిగా నిలుస్తూ ప్రస్తుత విద్యార్థులకు ప్రముఖ వ్యక్తులను పరిచయం చేస్తున్నారు. అంతేకాక పూర్వవిద్యార్థులంతా ఒక సంఘంగా ఏర్పడి ఉపకార వేతనాలు అందించడంలో తమవంతు కృషి చేస్తుండటం అభినందనీయం.

ఉన్నత శాస్త్ర-సాంకేతిక పరిశోధనలకు వీలుగా అధునాతనమైన లేబొరేటరీ సౌకర్యాలు, ఎల్లవేళలా ఇంటర్నెట్ సదుపాయం, విద్యార్థినీ-విద్యార్థులకు విడివిడిగా హాస్టలు వసతి, విస్తృతమైన రవాణా సదుపాయాలు, విశాలమైన ఆటస్థలం- అందుబాటులోనే వైద్యవసతి, బ్యాంకు- ఎ.టి.యం. సౌకర్యం ఇలా అన్ని సదుపాయాలతో- ఆధునిక వసతులతో అలరారుతున్నది "చన్ద్రశేఖరేన్ద్ర సరస్వతీవిశ్వమహావిద్యాలయం'...

**********